సాక్షి ప్రకాశం

గురువారం । 1 । ఆగస్టు । 2024



రెచ్చిపోతున్న పచ్చ భూచోళ్లు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే టీడీపీ నేతలు బరితెగిస్తున్నారు. ఎక్కడికక్కడ ప్రభుత్వ భూములను యథేచ్ఛగా కబ్జా చేస్తున్నారు. - 8లో..



రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

లారీ, ద్విచక్ర వాహనం ఢీకొని ఒకరు మృతి చెందిన ఘటన కర్నూలు–గుంటూరు జాతీయ రహదారిపై గంటవానిపల్లె సమీపంలో జరిగింది. - 8లో..

గరిష్టం/కనిష్టం
39/30

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

డీఎస్పీల బదిలీలు

- గత ప్రభుత్వ హయాంలో పనిచేసిన వారిని పక్కన పెట్టిన వైనం
- దర్శి డీఎస్పీగా లక్ష్మీ నారాయణకు పోస్టింగ్

ఒంగోలు టౌన్: ఎట్టకేలకు డీఎస్పీలను రాష్ట్ర ప్రభుత్వం బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అయితే గత ప్రభుత్వ హయాంలో పని చేసిన అధికారులను, ఎన్నికల సమయంలో వచ్చిన అధికారులను పక్కన పెట్టేశారు. కనిగిరి డీఎస్పీ రామరాజును బదిలీ చేయలేదు. ఆయన వచ్చే నెలలో రిటైర్‌మెంట్ కానుండడంతో ప్రస్తుతానికి ఆయనను బదిలీ చేయలేదని తెలుస్తోంది. జిల్లాలోని 4 సబ్ డివిజన్లకు గాను మూడు డివిజన్లలోని డీఎస్పీలను బదిలీ చేశారు. ఒంగోలు డీఎస్పీ యం.కిశోర్ బాబును పోలీస్ హెడ్ క్వార్టర్లో రిపోర్టు చేయమన్నారు. ఆయనకు ఎక్కడా పోస్టింగు ఇవ్వలేదు. ఆయన స్థానాన్ని కూడా భర్తీ చేయలేదు. అలాగే మార్కాపురం డీఎస్పీ యం.బాలసుందరరావును కూడా బదిలీ చేశారు. ఆయనను కూడా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో రిపోర్టు చేయమన్నారు. మార్కాపురానికి ఎవరికీ పోస్టింగ్ ఇవ్వలేదు. దర్శి డీఎస్పీ టి.అశోక్ వర్ధన్‌ను పోలీస్ హెడ్ క్వార్టర్స్‌కు రిపోర్టు చేయమన్నారు. ఆయన స్థానంలో సీఐడీ డీఎస్పీగా విధులు నిర్వహిస్తున్న బి.లక్ష్మీ నారాయణను నియమించారు. ఒంగోలు విషయంలో మొదట్నుంచి రాయపాటి శ్రీనివాసరావు పేరు వినిపిస్తోంది. ఆయనకు ఈ బదిలీల్లో ఎక్కడా పోస్టింగు ఇవ్వకపోవడంతో ఆయనకే ఖరారు కావచ్చని పోలీసు శాఖలో ప్రచారం జరుగుతోంది. అలాగే కొత్తగా శిక్షణ పొందుతున్న డీఎస్పీలకు ప్రాధాన్యత ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబు భావిస్తున్నట్లు తెలుస్తోంది.

పలువురు సీఐల బదిలీలు

ఒంగోలు టౌన్: జిల్లాలో పలువురు సీఐలను బదిలీ చేస్తూ గుంటూరు రేంజీ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి ఉత్తర్వులు ఇచ్చారు. ఒంగోలు తాలుకా పోలీసు స్టేషన్ సీఐగా కె.అజయ్ కుమార్‌ను నియమించారు. ప్రస్తుతం ఆయన నెల్లూరు మహిళా పోలీసు స్టేషన్ సీఐగా విధులు నిర్వహిస్తున్నారు. గతంలో ఆయన ఒంగోలులోని ఐటీ కోర్ ఎస్ఐగా పనిచేశారు. పదోన్నతిపై సీఐగా ఎస్సీ సెల్ బాధ్యతలు నిర్వర్తించారు. ఒన్‌టౌన్ సీఐగా రేంజీ వీర్‌లో ఉన్న వై.నాగరాజును నియమించారు. ఆయనకు జిల్లాలో ఎస్ఐగా చేసిన అనుభవం ఉంది. సింగరాయకొండ సీఐగా సీహెచ్ హజరత్తయ్య బాధ్యతలు చేపట్టనున్నారు. ఆయన పీటీసీలో ఎస్ఐగా పనిచేసి పదోన్నతిపై బాపట్ల మహిళా పోలీసు స్టేషన్‌కు వెళ్లారు. సింగరాయకొండ సీఐగా విధులు నిర్వహిస్తున్న రంగనాథ్‌ను రేంజి వీఆర్‌కు పంపించారు. చీమకుర్తి సీఐగా యం.సుబ్బారావును కొనసాగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవలే ఆయనను చీమకుర్తి పీఎస్‌కు అటాచ్‌మెంట్ చేశారు. ఒంగోలు సీసీఎస్ సీఐ టి.విజయ కృష్ణను నెల్లూరు జిల్లా రాపూర్ సర్కిల్‌కు బదిలీ చేశారు. ప్రస్తుతం ఒంగోలు ఒన్‌టౌన్ సీఐగా విధులు నిర్వహిస్తున్న షేక్ అల్లీసాహెబ్‌కు పోస్టింగ్ ఇవ్వలేదు. ఈ ఉత్తర్వులు వెంటనే అమలులోకి రానున్నాయి.

కారుణ్య నియామక పత్రాలు అందజేత




కారుణ్య నియామక పత్రాలు అందజేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

ఒంగోలు సిటీ: కారుణ్య నియామకం కింద ఇద్దరికి జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ బుధవారం ఆఫీస్ సబార్డినేట్ ఉద్యోగాలకు నియామక ఉత్తర్వులు అందించారు. జీ నరేష్‌కు ఒంగోలు జెడ్పీ కార్యాలయంలో, వై సుధాకర్‌కు గొట్లగట్టు జెడ్పీ హైస్కూల్లో ఆఫీస్ సబార్డినేట్‌లుగా నియామక ఉత్తర్వులు అందించారు. కార్యక్రమంలో ఉప ముఖ్య కార్యనిర్వహణాధికారి సి.హనుమంతరావు, ఎస్టాబ్లిష్మెంట్ సెక్షన్ పరిపాలనాధికారి వాకా శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

రొయ్యల హేచరీలు తనిఖీ

కొత్తపట్నం: జిల్లాలోని పలు రొయ్యల హేచరీలను కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ముందుగా కొత్తపట్నం మండలం గుమ్మళ్లపాలెంలో ఉన్న రవి హేచరీని సందర్శించి రొయ్య పిల్లల ఉత్పత్తి ప్రక్రియ, రొయ్యల సాగును రొయ్యల ఎగుమతుల్లో భాగంగా చేపట్టనున్న ప్రాసెసింగ్‌ను పరిశీలించారు. సీ వాటర్ రిజర్వాయర్ యూనిట్‌ను, ఫీడ్ యూనిట్‌ను, పవర్ యూనిట్ స్టోర్‌రూమ్ తదితర విభాగాలను పరిశీలించారు. అనంతరం ఈతముక్కల గ్రామ పరిధిలో చేపడుతున్న ఆక్వా కల్చర్‌ను పరిశీలించారు. రొయ్యలు సాగుచేస్తున్న ఆక్వా రైతు కల్లూరు సుబ్బారావుతో కలెక్టర్ మాట్లాడారు. ఎన్ని ఎకరాలు రొయ్యల సాగు చేస్తున్నారు, ఎకరాకు ఎంత ఖర్చవుతుంది రొయ్య పిల్లలను ఎక్కడ నుంచి కొనుగోలు చేస్తారు తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ సింగరాయకొండలోని దేవి సీ ఫుడ్స్ యూనిట్‌ను సందర్శించి రొయ్యల ఎగుమతుల్లో భాగంగా చేపట్టనున్న ప్రాసెసింగ్ ప్రక్రియను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట మత్స్యశాఖ జేడీ ఆవుల చంద్రశేఖర్‌రెడ్డి, మత్స్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

బుజ్జిగాడి పచ్చపన్నాగం



నగరపాలక సంస్థలో ఆయన కీలక నాయకుడు.. ఇన్నాళ్లూ పైకి మంచోడిలా కనిపించిన ఆయన ముసుగు తొలగించి తన కపట బుద్ధిని బయటపెట్టాడు.! నాటి శాసన సభ్యుడితో సన్నిహితంగా మెలుగుతూనే ఆయన కన్నుగప్పి భూ దందాలకు పాల్పడినట్లు తీవ్ర ఆరోపణలు వచ్చాయి. నేడు స్వార్థప్రయోజనాల కోసం వెన్నుపోటు రాజకీయాలకు తెరతీశాడు. నైతిక విలువలకు తిలోదకాలిచ్చి తల్లి లాంటి పార్టీకే ద్రోహం తలపెట్టేందుకు సిద్ధమయ్యాడు.

- స్వార్థ ప్రయోజనాల కోసం పార్టీ మారేందుకు యత్నం
- కీలక పదవులు అనుభవించడం.. ఏరుదాటిన తరువాత తెప్ప తగలేయడంలో దిట్ట
- భూ దందాల నుంచి తప్పించుకునేందుకే టీడీపీ వైపు చూపు
- ఎన్నికలకు ముందే ప్రత్యర్థి పార్టీ నాయకులతో మంతనాలు
- సొంత పార్టీ నేతలను సైతం ప్రలోభాలకు, బెదిరింపులకు గురిచేస్తున్న వైనం

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: పార్టీలో పదవులు అనుభవించి..సుదీర్ఘంగా ప్రయోజనాలు పొంది.. పార్టీ కష్టాల్లో ఉన్నప్పుడు తనకు ఎన్నో అవకాశాలిచ్చిన పార్టీని వదిలిపోవడం రాజకీయ నాయకులకు ఫ్యాషన్ అయిపోయింది. తమ స్వార్థ ప్రయోజనాల కోసం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ నమ్మిన వారిని నట్టేట ముంచడం సర్వసాధారణంగా మారింది. ఒంగోలు నగరానికి చెందిన ఓ నాయకుడి వ్యవహారశైలి వివాదాస్పదంగా ఉంది.

పార్టీలోనూ అధిక ప్రాధాన్యం..

ఒంగోలు నగరపాలక సంస్థ పరిధిలోని సదరు నాయకుడికి పార్టీ పరంగానూ అధిక ప్రాధాన్యత ఇచ్చారు. నగర పాలక సంస్థలో సభ్యుడిగా ఉంటూనే పార్టీ చేపట్టిన ఏ కార్యక్రమంలోనైనా ఆయన కనిపించేలా కీలకంగా వ్యవహరించాడు. ముఖ్యంగా నాటి శాసన సభ్యుడు బాలినేని శ్రీనివాసరెడ్డికి సన్నిహితుడిగా ఉంటూనే ఆయనకు తెలియకుండా అన్ని పనులు చక్కబెట్టుకున్నాడు. తీరా సొంత పార్టీ అధికారం కోల్పోయాక పచ్చ పార్టీలో చేరేందుకు రాయ'బేరాలు' నెరుపుతున్నట్లు ఆరోపణలు గుప్పుమంటున్నాయి. పైకి 24 కేరట్ బంగారంలా కనిపిస్తాడు కాని నిజానికి అసలు సిసలు కల్తీ బంగారమని తనకు తానే రుజువు చేసుకుంటున్నాడు.

కేసుల నుంచి తప్పించుకునేందుకేనా?

ఒంగోలు నగరంలో భూ కబ్జాలపై టీడీపీ నేతలు తీవ్ర ఆరోపణలు చేయడంతోపాటు వాటిని నాటి ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డికి అంటగట్టేందుకు విశ్వప్రయత్నాలు చేశారు. అయితే భూకబ్జాలు, నకిలీ పట్టాల సృష్టికర్తల వివరాలు బట్టబయలు చేయడం ద్వారా టీడీపీ నేతల విమర్శలను బాలినేని తిప్పికొట్టారు. అదే సమయంలో భూకబ్జా ఆరోపణలపై బాలినేని సిట్ విచారణకు నాటి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కలెక్టర్, ఎస్పీపైనా ఒత్తిడి తీసుకొచ్చి పట్టుబట్టి మరీ 'సిట్' వేయించారు. సొంత పార్టీ నేతలైనా సరే వదిలిపెట్టొద్దని మీడియా ముఖంగా బాలినేని స్పష్టం చేశారు. భూ కబ్జాలపై ఇప్పటికీ సిట్ అధికారులు దర్యాప్తు చేస్తూనే ఉన్నారు. ఈ నేపథ్యంలో సదరు నాయకుడు తన భూ దందాల గుట్టు బయటపడుతుందనే భయంతో పార్టీ మారేందుకు రంగం సిద్ధం చేసుకున్నట్లు సమాచారం.

పక్కాగా సేఫ్ గేమ్..

సదరు నాయకుడు ఎలాగైనా భూ కబ్జాల కేసుల నుంచి బయటపడేందుకు ఎన్నికలకు ముందు నుంచే ప్రణాళికలు సిద్ధం చేసుకున్నట్టు తెలిసింది. ఎన్నికల సమయంలో తన బంధువులను, సన్నిహితులను టీడీపీలోకి పంపేశాడు. ఒక వేళ అధికారం కోల్పోతే టీడీపీలోకి వెళ్లిన వారి సాయంతో తాను ఆ పార్టీకి వెళ్లిపోవచ్చనే పథకాన్ని రచించాడు. తన సేఫ్ గేమ్‌లో భాగంగా టీడీపీలోకి వెళ్లేందుకు అడుగులు వేస్తున్నట్టు సమాచారం. తనతో పాటు నగరపాలక సంస్థలో ఉన్న కార్పొరేటర్లు, మరికొంత మంది వైఎస్సార్ సీపీ ముఖ్య నాయకులను తీసుకొస్తానని పచ్చపార్టీ ముఖ్యులతో ఒప్పందం కుదుర్చుకున్నట్టు తెలిసింది.

తాయిలాలు..బెదిరింపులు:

తనతో పాటు పార్టీ మారాలంటూ సదరు నాయకుడు సహచర కార్పొరేటర్లతో రాయబారం నెరపుతున్నట్టు విశ్వసనీయ సమాచారం. తనతో పాటు టీడీపీలోకి వస్తే ఆర్థికంగా బాగుంటుందని, లేదంటే ఇబ్బందులు తప్పవంటూ బెదిరింపులకు తెరతీసినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. సదరు నాయకుడి వ్యవహారాన్ని వైఎస్సార్ సీపీ కేడర్ అసహ్యించుకుంటున్నారు. స్వార్థ ప్రయోజనాల కోసం పార్టీని దెబ్బ తీయాలని చూస్తున్న అతడి చర్యలను ఖండిస్తున్నారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు వెన్నుపోటు పొడిచే ప్రయత్నాలపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

సమన్వయంతో మహిళల అక్రమ రవాణాకు అడ్డుకట్ట

- ఎస్పీ ఏఆర్ దామోదర్



గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న ఎస్పీ ఏఆర్ దామోదర్

ఒంగోలు టౌన్: స్వచ్ఛంద సంస్థల సహకారం, సమన్వయంతో మహిళలు, బాలల అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు సమష్టి కృషి చేయాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం హెల్ప్, విముక్తి, ఆంధ్రప్రదేశ్ సీఐడీ, ఆంధ్ర ప్రదేశ్ బాలల హక్కుల కమిషన్ ఆధ్వర్యంలో రూపొందించిన గోడ పత్రికను ఎస్పీ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహిళలు, బాలలు మోసాలకు గురికాకుండా విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. చట్టాలపై అవగాహన కల్పించడం ద్వారా వారిని చైతన్యం చేయాల్సిన బాధ్యత కూడా ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. గ్రామీణ నిరుపేద, నిరక్షరాస్యత కలిగిన మహిళల అమాయకత్వాన్ని ఆసరా చేసుకొని కొందరు నేరస్తులు మోసాలకు పాల్పడుతున్నారని, మాయమాటలతో ఆశలు కల్పించి వ్యభిచార గృహాలకు తరలిస్తున్నట్లు అనేక నివేదికలు వెల్లడిస్తున్నాయని తెలిపారు. గోడ పత్రికను జిల్లాలోని అన్నీ ప్రభుత్వ కార్యాలయాల్లో ఉండేలా చర్యలు తీసుకోవాలని స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఎస్పీకి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, అడిషనల్ ఎస్పీ (క్రైం) ఎస్వీ శ్రీధర్ రావు, జిల్లా జైలు సూపరింటెండెంట్ పి.వరుణా రెడ్డి, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు బీవీ సాగర్, ఎం.మురళీ కృష్ణ పాల్గొన్నారు.

రెడ్‌బుక్ పేరుతో రాష్ట్రంలో అరాచకాలు

- రాజ్యమేలుతున్న హత్యా రాజకీయాలు
- రాష్ట్రంలో క్షీణించిన శాంతిభద్రతలు
- వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు అండగా జగనన్న
- ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్



బాధిత కుటుంబానికి చెక్కు అందచేస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

యర్రగొండపాలెం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రెడ్‌బుక్ పేరుతో రాష్ట్రంలో అరాచకాలు సృష్టిస్తున్నారని ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ విమర్శించారు. బుధవారం మండలంలోని గుర్రపుశాలలో ఎన్నికల సమయంలో టీడీపీ వర్గీయుల దాడిలో గాయపడిన వైఎస్సార్ సీపీ కార్యకర్త బుక్కె నారాయణను ఆయన పరామర్శించి రూ.50 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తప్పుడు వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఆ వాగ్దానాలను నెరవేర్చలేక తమ వర్గీయులను రెచ్చగొట్టి వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులపై దాడులు చేయిస్తున్నారని ఆయన అన్నారు. పల్నాడు జిల్లా వినుకొండలో వైఎస్సార్ సీపీ కార్యకర్త రషీద్‌ను నడిరోడ్డుపై టీడీపీకి చెందిన జిలానీ దారుణంగా కత్తితో నరికి చంపాడని, రాష్ట్రంలో వైఎస్సార్ విగ్రహాలు కూల్చివేత, వైఎస్సార్ సీపీ కార్యాలయాలు ధ్వంసం చేస్తున్న పోలీసులు మాత్రం ప్రేక్షకపాత్ర వహిస్తున్నారని అన్నారు. 2019–24 మధ్య కాలంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో రాష్ట్రంలో ఎటువంటి అరాచకాలు జరగలేదని, సాధింపు చర్యలు చేపట్టలేదని, టీడీపీ సానుభూతి పరులు, సామాన్యులపై దాడులు జరిగిన దాఖలాలు లేవని అన్నారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులు, ప్రజా ప్రతినిధులు అధైర్యపడవద్దని, తమకు జగనన్న అండగా ఉన్నారన్నారు. తమ పార్టీకి ప్రజల ఆశీస్సులు ఉన్నాయని, జగన్‌మోహన్‌రెడ్డిని తమ గుండెల్లో పదిలంగా పెట్టుకున్నారని, ఆయన పాలనలో జరిగిన మేలును ఎన్నటికీ మరచిపోలేదరని చెప్పారు. వైఎస్సార్ సీపీ ప్రజా ప్రతినిధులు, నాయకులు గ్రామాల్లో ప్రజల సమస్యలు తెలుసుకొని పరిష్కరించేదుకు కృషి చేయాలని ఆయన కోరారు. అనంతరం పార్టీ నుంచి పంపించిన రూ.50 వేల చెక్కును నారాయణకు అందజేశారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉడుముల శ్రీనివాసరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు ఒంగోలు మూర్తి రెడ్డి, ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్, జెడ్పీటీసీ చేదూరి విజయభాస్కర్, పార్టీ మండల అధ్యక్షుడు కొప్పర్తి చిన్న ఓబులరెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ సయ్యద్ జబీవుల్లా, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు పి.రాములు నాయక్, సర్పంచ్‌లు వాడాల వీరయ్య పద్మా, అరుణాబాయి, ఏకుల ముసలారెడ్డి, వై.వెంకటేశ్వరరెడ్డి, ఒంగోలు సుబ్బారెడ్డి, కందుల నాగార్జునరెడ్డి, బి.బాలచెన్నయ్య పాల్గొన్నారు.

ఎల్ఐసీ పరిరక్షణకు దేశవ్యాప్త ఉద్యమం

- ఎల్ఐసీఏవోఐ రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ కె రాజశేఖర్



మాట్లాడుతున్న రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ రాజశేఖర్

ఒంగోలు సెంట్రల్: లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసీ) సంస్థను కాపాడుకోవటం కోసం ఎల్ఐసీ ఏజెంట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసీఏవోఐ) దేశవ్యాప్త ఉద్యమం నిర్వహిస్తుందని యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ కే రాజశేఖర్ అన్నారు. ఒంగోలు యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో బుధవారం 'ఐఆర్డీఐ నూతన ప్రతిపాదనలు– ఎల్ఐసీ ఏజెంట్లపై ప్రభావం' అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కే రాజశేఖర్ మాట్లాడుతూ దేశ ఆర్థిక వ్యవస్థకు తల మానికంగా ఉన్న ఎల్ఐసీ సంస్థను మోదీ మిత్రులైన అంబానీ, ఆదానీలకు కట్టబెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తోందని అన్నారు. అందులో భాగంగా ఐఆర్డీఐ ద్వారా బీమా చట్టం పేరుతో ఎల్ఐసీపై నమ్మకంతో పెట్టుబడి పెట్టే కస్టమర్ల ప్రయోజనాలకు భిన్నంగా నూతన ఇన్సూరెన్స్ విధానంలో మార్పులు తీసుకురావాలని ప్రయత్నిస్తోందని విమర్శించారు. బీమా సుగం, బీమా విస్తార్, బీమా వాహక్ పద్ధతులతో ఏజెంట్ల మనుగడకు కూడా ముప్పు తెచ్చే చర్యలు తీసుకొస్తోందని, దీనివల్ల పాలసీదారులకు సంస్థకు వారధిగా ఉన్న ఏజెంట్లకు ఉద్వాసన పలికేందుకు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. యూనియన్ రాష్ట్ర నాయకుడు కే బాలచంద్రం మాట్లాడుతూ పార్లమెంట్ సభ్యులకు వినతి పత్రాలు ఇవ్వటం, ఆగస్టు 9న ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. యూనియన్ డివిజన్ వర్కింగ్ ప్రసిడెంట్ బీ వెంకటరావు, బ్రాంచి అధ్యక్షులు ఎం వెంకటేశ్వర్లు, నాయకులు ఆర్ శ్రీనివాసరావు, బీవీ రమణయ్య, కె వెంకటేశ్వర్లు, ఎస్ బసవయ్య, టి నాగేశ్వర రావు, సీహెచ్ నరసింహారావు, తిరుపతి నాయుడు, రామాంజనేయులు పాల్గొన్నారు.

శ్రీశైలం ఘాట్‌లో రద్దీ

- శ్రీశైలం ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో చూసేందుకు పోటెత్తుతున్న జనం
- నల్లమల ఘాట్‌రోడ్డులో పెరిగిన సందర్శకుల రద్దీ
- జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి శ్రీశైలం తరలి వెళ్తున్న సందర్శకులు



శ్రీశైలం డ్యాం నుంచి నీటిని విడుదలవుతున్న నీరు

పెద్దదోర్నాల: ఎగువ ప్రాంతాల్లో భారీగా కురుస్తున్న వర్షాలతో కృష్ణా నదికి వరద పోటెత్తుతోంది. దీంతో శ్రీశైలం ప్రాజెక్టు గేట్లను ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. డ్యాంను చూసేందుకు యాత్రికులు భారీగా శ్రీశైలం తరలి వెళ్తున్నారు. దీంతో మండల పరిధిలోని నల్లమలలో వాహనాల రద్దీ ఏర్పడింది. నల్లమల అభయారణ్యం పేరు వింటేనే ప్రకృతి ప్రేమికుల మనస్సు పులకిస్తుంది. పచ్చని తివాచీ పరిచినట్లుండే అందమైన పచ్చిక బయళ్ల నడుమ ఒంపులు తిరిగే రోడ్లలో ప్రయాణం పర్యాటకులను కనువిందు చేస్తుంది. ఓ వైపు అభయారణ్యంతో మల్లన్న కొలువు దీరిన శ్రీశైల పుణ్య క్షేత్రం భక్తులకు కొంగు బంగారంగా వెలుగొందుతుంటే, మరోవైపు భ్రమరాంబా మల్లికార్జునుల పాదపద్మాలను స్పృశిస్తూ ప్రవహించే కృష్ణా నదిపై అభయారణ్యంలో నిర్మించిన బహుళార్థక నీలం సంజీవరెడ్డి శ్రీశైలం హైడ్రో ఎలక్ట్రికల్ ప్రాజెక్టు నల్లమల అందాలకు మరింత శోభను చేకూరుస్తుంది. ఇటీవల కొంత కాలంగా శ్రీశైలం డ్యాం ఎగువ భాగంలో కురిసిన భారీ వర్షాలకు శ్రీశైలం డ్యాంకు భారీగా వరద నీరు వచ్చి చేరుతుండటంతో శ్రీశైలం ప్రాజెక్టు జలకళను సంతరించుకుంది. డ్యాంకు వరద ప్రవాహం అధికంగా ఉండటంతో రెండు రోజులుగా డ్యాం గేట్ల ద్వారా నీటిని దిగువనున్న నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు. దీంతో డ్యాం వద్ద నీరు దిగువకు జాలువారుతున్న దృశ్యాలను చూసేందుకు సందర్శకులు భారీగా శ్రీశైలం డ్యాంసైట్‌కు తరలి వెళ్తున్నారు. దీంతో మండల కేంద్రంలోని గణపతి చెక్‌పోస్టు వద్ద శ్రీశైలం వెళ్లే వాహనాలతో రద్దీ వాతావరణం ఏర్పడింది.



డ్యాం వద్ద ఏర్పడిన వాహనాల రద్దీ



నల్లమలలో అల్పాహారం చేస్తున్న సందర్శకులు

నేడు పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికల నోటిఫికేషన్

- సాయంత్రం 2గంటలకు ఓటరు జాబితా విడుదల
- 5న అభ్యంతరాల స్వీకరణ, అదేరోజు సాయంత్రం తుది జాబితా ఖరారు
- 8న ఎన్నికలు, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ , వైస్ చైర్మన్ ఎన్నిక

ఒంగోలు:

జిల్లాలోని ప్రైవేటు అన్ ఎయిడెడ్ మినహా ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలకు పాఠశాల యాజమాన్య కమిటీల ఎన్నికలకు గురువారం నోటిఫికేషన్ విడుదలకానుంది. ఈ మేరకు సమగ్రశిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో జిల్లాలో 2334 పాఠశాలలకు పాఠశాలల యాజమాన్య కమిటీలను ఎంపిక చేస్తారు. ఈ ప్రక్రియ మొత్తం ఆగస్టు 1 నుంచి 8వ తేదీలోపు పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

నేడు నోటిఫికేషన్:

పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్‌ను పాఠశాల హెడ్మాస్టర్ / ఇన్‌చార్జి హెడ్మాస్టర్‌లు గురువారం ఉదయం 10 గంటలకు విడుదల చేస్తారు. పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలకు సంబంధించి ఈ నోటిఫికేషన్ ఉంటుంది. మధ్యాహ్నం 2 గంటలకు తరగతుల వారీగా ఓటర్ల జాబితా విడుదల చేస్తారు. 5వ తేదీ ఓటర్ల జాబితాపై అభ్యంతరాల స్వీకరణ, సాయంత్రం 3 నుంచి 4 గంటల మధ్య పరిశీలన అనంతరం తుది జాబితా విడుదల చేస్తారు. 8వ తేదీ ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట మధ్య ఎన్నికల నిర్వహణ, 1.30 గంటలకు చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక, 2 గంటలకు ప్రమాణ స్వీకారం, 3 నుంచి 3.30 గంటల మధ్య పాఠశాల యాజమాన్య కమిటీ తొలి సమావేశం నిర్వహిస్తారు. తరగతికి ముగ్గురు చొప్పున సభ్యుల ఎంపిక పూర్తయిన తరువాత పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్‌ల ఎన్నిక ఉంటుంది. ఇందులో ఒకరు పురుషులు అయితే మరొకరు తప్పనిసరిగా మహిళ ఉండాలి. ఒక వేళ ఇద్దరు మహిళలు ఉండవచ్చు. ఎంపిక సమయంలో గుర్తింపు కార్డు (ఓటరు కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, రేషన్ కార్డు తదితరాలు) చూపి ఓటింగ్‌లో పాల్గొనాల్సి ఉంటుంది. సంరక్షకులు ఎన్నికల్లో సభ్యులుగా పోటీచేసేందుకు అనర్హులు. ఎన్నికల ప్రక్రియను విలేజి రెవెన్యూ అసిస్టెంట్, విలేజి రెవెన్యూ ఆఫీసరు, మండల తహసీల్దారు, మండల ప్రజా పరిషత్ అధికారులు పరిశీలకులుగా వ్యవహరిస్తారు.

ఎక్స్ అఫీషియో సభ్యులు:

పాఠశాల హెడ్మాస్టర్ మెంబర్ కన్వీనర్, ఎంఈవో నామినేట్ చేసిన మరో టీచర్ (హెడ్మాస్టర్ , నామినేటెడ్ టీచర్‌లలో ఒకరు పురుషులు అయితే మరొకరు స్త్రీ అయి ఉండాలి), కార్పొరేటర్/కౌన్సిలర్/వార్డు మెంబర్, సంబంధిత ప్రాంతంలోని అంగన్‌వాడీ వర్కర్, ఏఎన్ఎం , సంబంధిత ప్రాంత గ్రామ/ వార్డు మహిళా సమాఖ్య అధ్యక్షులు సభ్యులుగా ఉంటారు.

కోఆప్టెడ్ మెంబర్లు:

ప్రముఖ విద్యావేత్త, పరోపకారి, స్వచ్ఛంద సంఘ సభ్యుడు, పూర్వ విద్యార్థి, లేదా పాఠశాల బలోపేతానికి సహకరించే మరో వ్యక్తులలో ఇద్దరిని ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది. వీరి పదవీ కాలం కూడా రెండు సంవత్సరాలు మాత్రమే ఉంటుంది.

లోకల్ అథారిటీ చైర్‌పర్సన్:

సర్పంచ్/మున్సిపల్ చైర్‌పర్సన్/మేయర్‌లు తమ పరిధిలోని ఏ పాఠశాల కమిటీ మీటింగ్‌కు అయినా హాజరుకావొచ్చు. అది వారి విచక్షణమేరకు అవకాశం కల్పిస్తారు.

క్లుప్తంగా

పొగాకు గరిష్ట ధర రూ.361



పొదిలిలో అమ్మకానికి సిద్ధంగా ఉన్న బేళ్లు

ఒంగోలు సెంట్రల్: ఒంగోలు రీజియన్ పరిధిలో బుధవారం గరిష్ట ధర రూ.361 పలికిందని ఆర్ఎం లక్ష్మణరావు తెలిపారు. రీజియన్ పరిధిలోని 11 కేంద్రాల్లో 9906 బేళ్లు రాగా 8628 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేసి 1249 బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించారు. ఒంగోలు, వెల్లంపల్లి, కొండపి, టంగుటూరు కేంద్రాల్లో 119వ రోజు వేలం పాటలో 4965 బేళ్లు రాగా 4480 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేయగా 485 బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించారు. గరిష్ట ధర రూ.361, కనిష్ట ధర రూ.205, సరాసరి రూ.299.48 పలికింది. కందుకూరు-1,2, కనిగిరి, డీసీపల్లి, కలిగిరి, పొదిలి కేంద్రాల్లో 113వ రోజు వేలంపాటలో 4912 బేళ్లు రాగా 4148 బేళ్లు కొనుగోలయ్యాయి. 764 బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించారు. గరిష్ట ధర రూ.359, కనిష్ట ధర రూ.204, సరాసరి రూ.296.76 పలికింది.

విధి నిర్వహణలో అలసత్వాన్ని సహించం



రికార్డులు పరిశీలిస్తున్న డీఈఓ సుభద్ర

మద్దిపాడు: విధి నిర్వహణలో వలసత్వం వహిస్తే సహించేది లేదని, చర్యలు తీసుకుంటానని డీఈఓ సుభద్ర అన్నారు. మండలంలోని తెల్లబాడు పీఎస్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ క్రమంలో ఆమె పలు రికార్డులు పరిశీలించారు. బాలికలపై లైంగిక వేధింపులకు సంబంధించి విద్యార్థినులు ప్రధానోపాధ్యాయునికి ఉత్తరం రాయడానికి బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సూచించిన విధంగా కంప్లెయింట్ బాక్స్ ఏర్పాటు చేయకపోవడం, విద్యార్థులకు కోడిగుడ్లు చిక్కీలు అందుబాటులో లేకపోవడంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రార్థనా సమయంలో పాఠశాలలో విషయాలపై అవగాహన కల్పించాలని ఇన్‌చార్జి హెచ్‌ఎంను ఆదేశించారు. రిజిస్టర్స్ సక్రమంగా నిర్వహించాలని, కోడిగుడ్లకు సంబంధించిన పూర్తి రిపోర్టు కార్యాలయానికి పంపాలని ఆదేశాలు జారీ చేశారు. ఆమె వెంట ఎంఈఓ ఎంవీఆర్ ఆంజనేయులు, పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాల మాయం కేసులో షిఫ్ట్ ఆపరేటర్ల తొలగింపు

యర్రగొండపాలెం: మండలంలోని అమానిగుడిపాడు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో విద్యుత్ స్తంభాల మాయమైన సంఘటనలో నలుగురు షిఫ్ట్ ఆపరేటర్లను తొలగించినట్లు మార్కాపురం డీఈ పీవీ నాగేశ్వరరావు తెలిపారు. గ్రామంలో కొత్త విద్యుత్ స్తంభాలు ఏర్పాటుచేసి తొలగించిన 105స్తంభాలను నిర్మాణ విభాగానికి చెందిన కాంట్రాక్టర్లు సబ్ స్టేషన్‌లో ఉంచారు. అయితే అవి కనిపించలేదని ఫిర్యాదు రావడంతో ఏఈ అల్లూరయ్యతో దర్యాప్తు చేసి షిఫ్ట్ ఆపరేటర్లు ఎస్.బాబు, ఎస్.నాగేంద్ర, వై.అవినాష్, పి.శ్రీనులను తొలగించినట్లు డీఈ తెలిపారు. ఆ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో పనిచేస్తున్న లైన్‌మెన్, ఎనర్జీ అసిస్టెంట్, లైన్ ఇన్‌స్పెక్టర్లకు సంజాయిషీ నోటీసులు ఇచ్చామని ఆయన వివరించారు.

నేటి నుంచి పోలీస్ యాక్ట్ అమలు

ఒంగోలు టౌన్: శాంతి భద్రతలలో భాగంగా గురువారం నుంచి ఈ నెల 31 వరకు ఒంగోలు సబ్ డివిజన్ పరిధిలో 30 పోలీసు యాక్ట్ అమల్లో ఉంటుందని డీఎస్పీ కిశోర్‌బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, యూనియన్లు పోలీసుల అనుమతి లేకుండా సభలు, సమావేశాలను నిర్వహించరాదని తెలిపారు. నిబంధనలకు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.



బేస్తవారిపేటలో టీడీపీ నేత బాగు చేయించిన బస్ షెల్టర్ స్థలం



దరగా-జేబీకేపురం మధ్య వాగును ఆక్రమించి చదును చేసిన దృశ్యం



కలుజువ్వలపాడు వద్ద టీడీపీ నేత ఆక్రమించిన మేత భూమి

రెచ్చిపోతున్న పచ్చ భూచోళ్లు

"చెప్పేవి శ్రీరంగ నీతులు.. చేసేవి చండాలపు పనులు" ఈ సామెత టీడీపీ నేతలకు అతికినట్టు సరిపోతుంది.! వైఎస్సార్ సీపీ అధికారంలో ఉండగా భూకబ్జాలంటూ నిత్యం విషం చిమ్ముతూ.. నచ్చని నేతలపై బట్ట కాల్చి మీద వేస్తూ.. అసత్యాల బురదజల్లిన టీడీపీ నాయకులు తమ పార్టీ గద్దెనెక్కగానే జూలు విదిలిస్తున్నారు. ప్రభుత్వ భూములు కబ్జా చేసేందుకు అవురావురుమంటూ అధికారులను సైతం భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. కోట్ల రూపాయల విలువైన భూముల్లో పాగా వేసి బిట్లు బిట్లుగా విక్రయించేందుకు పథక రచన చేశారు. సంపద సృష్టించడమంటే ఇదేనేమో కాబోలు అని నివ్వెరపోవడం ప్రజల వంతయింది.

- బేస్తవారిపేట బస్‌షెల్టర్ స్థలంపై టీడీపీ నాయకుల కన్ను
- రూ.70 లక్షల విలువైన 20 సెంట్ల స్థలం కొట్టేసేందుకు స్కెచ్
- దరగా-జేబీకే పురం మధ్య వాగును ఆక్రమించిన మరో చోటా నేత
- తర్లుపాడు మండలం కలుజువ్వలపాడులో మేత బీడుభూమి కబ్జా
- వెబ్‌ల్యాండ్‌లో అక్రమంగా నమోదు.. ఫ్లాట్లు వేసి విక్రయించేందుకు సిద్ధం
- అధికారమే అండగా చెలరేగుతున్న టీడీపీ నాయకులు

బేస్తవారిపేట: స్థానిక అంకాలమ్మ వీధిలో జాతీయ రహదారి పక్కన బస్ షెల్టర్ నిర్మాణం కోసం కేటాయించిన విలువైన స్థలంపై ఓ టీడీపీ నాయకుడి కన్నుపడింది. ఈ భూమి తనది అంటూ రెండు రోజుల క్రితం జేసీబీ యంత్రం పెట్టి చిల్లకంప తొలగించాడు. చుట్టు పక్కల గృహాల వారు స్పందించి ఇది ఆర్టీసీ బస్‌షెల్టర్‌కు కేటాయించిన స్థలం, మీరెందుకు బాగుచేస్తున్నారని నిలదీయడంతో తన వద్ద అన్ని పత్రాలు ఉన్నాయంటూ దబాయించాడు. తోకపల్లె-కడప హైవే రోడ్డు పక్కన బేస్తవారిపేట బస్టాండ్‌కు సమీపంలో సర్వే నంబర్ 283/1లో బస్ షెల్టర్‌కు రెవెన్యూ అధికారులు 20 సెంట్ల స్థలాన్ని కేటాయించారు. హైవే రోడ్డు వెంట స్థలం కావడంతో ధర రూ.లక్షల్లో పలుకుంది. పూర్వం సర్వే నంబర్ 283లో ఉన్న 1.86 ఎకరాల స్థలాన్ని రెండు సబ్ డివిజన్లు చేశారు. దీనిలో కొందరికి పట్టాలు మంజూరు చేశారు. 2011లో బస్ షెల్టర్ నిర్మాణానికి శంకుస్థాపన చేయగా అంకాలమ్మ దేవాలయానికి సరైన దారి లేకుండా పోతుందని అప్పట్లో కొందరు హైకోర్టుకు వెళ్లారు. కోర్టు ఆదేశాలతో బస్ షెల్టర్ నిర్మాణానికి బ్రేక్ పడింది. సుమారు రూ.70 లక్షల విలువైన ఈ స్థలాన్ని టీడీపీ నాయకులు కబ్జా చేసేందుకు పక్కాగా స్కెచ్ వేసి రంగంలోకి దిగారు. రెవెన్యూ అధికారులు తక్షణమే స్పందించి ఆక్రమణను అడ్డుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వాగును మింగేస్తున్నారు!


బేస్తవారిపేట మండలంలోని దరగ నుంచి జేబీకే పురం వెళ్లే రోడ్డు పక్కన వాగును పూర్తిగా ఆక్రమించేందుకు ఓ రైతు ఉపక్రమించాడు. కొత్తగా పొలం కొనుగోలు చేసిన జేబీకే పురానికి చెందిన ఒకరు జేసీబీతో పొలం చదును చేస్తున్నాడు. ఈ పొలం పక్కన యాదల వాగు ఉంది. చెట్టిచర్ల పరిసర ప్రాంతాలు, దరగ కొండ పక్క నుంచి యాదల వాగులోకి వరద నీరు ప్రవహిస్తుంది. ఎన్నో ఏళ్లగా ఉన్న వాగును నామరూపాలు లేకుండా చేస్తుండటంతో చుట్టు పక్కల రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. భారీ వర్షాలు కురిస్తే చెట్టిచర్ల వైపు నుంచి వరద నీరు దిగువకు వెళ్లే మార్గం లేకుండాపోతుందని, అదే జరిగితే భూములన్నీ నీట మునిగి సాగుకు పనికిరాకుండా తయారవుతాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెవెన్యూ అధికారులు స్పందించి ఆక్రమణను అడ్డుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తాం

సర్వే నెంబర్ 283/1లో బస్ షెల్టర్ కోసం కేటాయించిన 20 సెంట్ల స్థలం ప్రభుత్వానికి చెందినది. ఈ స్థలం కోర్టు వివాదంలో ఉంది. ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. బస్‌షెల్టర్‌కు కేటాయించిన స్థలంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసి ఆక్రమణకు గురికాకుండా అడ్డుకుంటాం.

– షేక్ పర్వీన్, ఇన్‌చార్జి తహసీల్దార్ బేస్తవారిపేట

కలుజువ్వలపాడులో 'పోరంబోకు'లు



ఎఫ్‌ఎల్‌ఆర్‌లో మేత బీడుగా పేర్కొన్న భూమి

తర్లుపాడు: ప్రభుత్వమే మనదైనప్పుడు ఎవరేం చేస్తారనుకున్నారో ఏమో.. ఇన్నాళ్లు మిన్నకుండిపోయిన అక్రమార్కులు ఒక్కొక్కరుగా బయటకు వస్తున్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో మేత బీడు భూములను ఆన్‌లైన్‌లో వారసత్వంగా నమోదుచేసి మిన్నకుండిపోయిన నేతలు మళ్లీ ఆ పార్టీ అధికారంలోకి రాగానే రెచ్చిపోతున్నారు. మేత భూమిని జేసీబీలతో బాగు చేయించి ప్లాట్లువేసి అమ్మేసేందుకు సిద్ధమయ్యారు. ఈ తతంగమంతా తర్లుపాడు మండలంలోని కలుజువ్వలపాడులో జరుగుతోంది. జాతీయ రహదారి పక్కనే సర్వే నం.347-9లో 1.24 ఎకరాల పశువుల మేత బీడుభూమి ఉంది. విలువైన ఈ భూమిని 2018లో ఓ టీడీపీ నేత అధికారులపై ఒత్తిడి తెచ్చి తన పేరుతో నమోదు చేయించుకున్నాడు. 2019 ఎన్నికల్లో టీడీపీ ఓడిపోవడంతో సదరు నేత సైలెంటయ్యాడు. ఇటీవల ఎన్నికల్లో టీడీపీ కూటమి గెలవగానే భూమిని కాజేసే ఎత్తుగడలకు మరింత పదునుపెట్టాడు.

అలుగును సైతం పూడ్చి..

సర్వే నం.349-4లో 1.67 ఎకరాల్లో చెరువు ఉంది. ఈ చెరువు గ్రామానికి ఎంతో ముఖ్యమైనది. చెరువు నిండాక నీళ్లన్నీ ఆక్రమిత భూమిలో నుంచే బయటకు వెళ్లాలి. సదరు అక్రమార్కులు అలుగును సైతం మట్టితో పూడ్చేందుకు సిద్ధమయ్యారు. నిబంధనల ప్రకారం పశువుల మేత బీడు భూమిలో పట్టాలు ఇవ్వకూడదు. ఆన్‌లైన్ చేయకూడదు. రెవెన్యూ అధికారులకు ఆ నిబంధనలేమీ పట్టలేదు. మేత భూమి ఆక్రమణపై రెవెన్యూ అధికారులు ఇప్పటికైనా స్పందిస్తారో లేదో వేచి చూడాల్సిందే.

ప్రభుత్వ భూములు కాపాడుతాం

కలుజువ్వలపాడులో మేత బీడు భూమిని అక్రమంగా ఆన్‌లైన్ చేయించుకున్నట్లు నా దృష్టికి రాలేదు. రెవెన్యూ సిబ్బందితో సమాచారం తెప్పించుకుని, క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తా. ప్రభుత్వ భూములను అక్రమార్కుల చెర నుంచి కాపాడుతాం.

– అబ్దుల్ హమీద్, తహసీల్దార్, తర్లుపాడు

డబ్బులు ఊరికే రావు.. ఎవర్నీ నమ్మొద్దు

- ఎస్పీ దామోదర్



ఎస్పీ దామోదర్

ఒంగోలు టౌన్: తక్కువ పెట్టుబడులతో ఎక్కువ డబ్బులు వస్తాయంటూ చెప్పే మాటలను నమ్మి మోసపోవద్దని ఎస్పీ ఏఆర్ దామోదర్ బుధవారం ఒక ప్రకటనలో సూచించారు. నిత్యం చోటుచేసుకుంటున్న ఈ తరహా మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. సోషల్ మీడియాలో ఫేక్ ఖాతాలు, యాప్‌లు, వాట్సప్ గ్రూపులు, టెలిగ్రాం ఛానెళ్లు, కంపెనీ బ్రాండ్‌ను పోలిన వెబ్‌సైట్లను రూపొందించిన సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారని వివరించారు. ఇందులో నకిలీ ఉద్యోగి ఐడీ కార్డులను ప్రదర్శిస్తూ సభ్యులను నమ్మించేందుకు ప్రయత్నిస్తున్నారని, మొదట్లో నమ్మకం కలిగించేందుకు పెట్టుబడులకు వచ్చిన లాభాలను బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తుంటారని తెలిపారు. అత్యాశ కలిగించి ఎక్కువ పెట్టుబడులు పెట్టిస్తారని, అధిక మొత్తంలో పెట్టుబడులు పెట్టిన తరువాత మోసానికి తెరదీస్తారని వివరించారు. ఈ నేపథ్యంలో సోషల్ మీడియా ద్వారా ప్రజలను అప్రమత్తం చేస్తామని తెలిపారు. వాట్సప్ గ్రూపుల ద్వారా హెచ్చరిక మెసెజీలను పంపించడం, ప్రజలలో అవగాహ కలిగిస్తూ పోస్టర్లు, వీడియోలను విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు. సైబర్ నేరాలపై అవగాహన పెంచేందుకు గ్రామ, పట్టణ ప్రాంతాల్లో సమావేశాలు నిర్వహిస్తామన్నారు. పెట్టుబడిదారులు సెబీ రిజిస్ట్రేషన్, స్టాక్ ఎక్స్ఛేంజ్ సభ్యత్వాన్ని తనిఖీ చేయడం ద్వారా స్టాక్ మార్కెట్ బ్రోకర్ల చట్టబద్ధతను ధ్రువీకరించుకోవాలన్నారు. బ్రోకర్లతో లావాదేవీలు నిర్వహించే సమయంలో అధికారిక కమ్యూనికేషన్ చానెళ్లను మాత్రమే ఉపయోగించాలన్నారు. వ్యక్తిగత సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లో షేర్ చేయవద్దని, అనధికారిక లింక్‌లను క్లిక్ చేయవద్దని సూచించారు.

పామూరులో పట్టపగలే చోరీ



చోరీపై వివరాలు సేకరిస్తున్న సీఐ, ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం



బీరువా

- 298 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.35 వేల నగదు చోరీ
- వివరాలు సేకరిస్తున్న క్లూస్‌టీం

పామూరు: పామూరులోని కలాం సెంటర్‌లో పట్టపగలే చోరీ జరిగింది. ఎస్సై ఎం సైదుబాబు తెలిపిన వివరాలు... పామూరులోని కలాం సెంటర్‌లోని ఓ గృహంలో రిటైర్డ్ ఉపాధ్యాయుడు ముప్పాళ్ల ప్రేమ్‌కుమార్ ఉంటున్నాడు. కుటుంబసభ్యులు కనిగిరి వెళ్లారు. ముప్పాళ్ల ప్రేమ్‌కుమార్ తన సొంతపనిపై సుమారు ఉదయం 10 గంటల ప్రాంతంలో తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి తరువాత బయట పనులు చూసుకుని మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో ఇంటికి తిరిగి వచ్చారు. ఇంటి ప్రధాన డోర్‌ను పగులగొట్టి ఉండటంతో ఇంట్లోకి వెళ్లి చూశారు. బీరువా తెరిచి ఉండి అందులోని 298 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.35 వేల నగదు కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. చోరీ జరిగిన ఇంటిని సీఐ రామానాయక్, ఎస్సై సైదుబాబు పరిశీలించి చోరీ తీరుపై యజమానిని అడిగి వివరాలు సేకరించారు. విషయాన్ని ఒంగోలు క్లూస్‌టీంకు వివరించి వారిని పిలిపించగా క్లూస్‌టీం ఎస్సై శరత్‌బాబు నేతృత్వంలో ఆధారాలు సేకరిస్తున్నారు. బాధితుడు ప్రేమ్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, రాత్రికి డాగ్‌స్క్వాడ్ బృందం రానుందని ఎస్సై సైదుబాబు తెలిపారు.

గొడవలకు పాల్పడితే రౌడీషీట్ ఓపెన్‌చేస్తాం

- డీఎస్పీ అశోక్‌వర్ధన్



రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ అశోక్‌వర్ధన్

ముండ్లమూరు: గ్రామాల్లో ప్రశాంత వాతావరణానికి భంగం కలిగించేలా గొడవలకు పాల్పడితే రౌడీషీట్ ఓపెన్ చేస్తామని దర్శి డీఎస్పీ టి.అశోక్‌వర్ధన్ హెచ్చరించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శంకరాపురం గ్రామానికి చెందిన రెండు టీడీపీ వర్గాల నాయకులకు బుధవారం కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎన్నికల అనంతరం గ్రామంలో టీడీపీకి చెందిన రెండు వర్గాలు పరస్పర దాడులు చేసుకున్నారన్నారు. ఈ దాడులు బాపట్ల జిల్లా అద్దంకి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగినందున అద్దంకి పోలీస్‌స్టేషన్లో కేసులు నమోదయ్యాయన్నారు.

అందులో భాగంగా కొందరు జైలుకు వెళ్లి బెయిల్ వచ్చారు. ఈ సందర్భంగా ఇరువర్గాల వారిని ముండ్లమూరు పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం వారితో మాట్లాడుతూ అందరూ సత్ప్రవర్తన కలిగి ఉండాలని సూచించారు.

కాదని దాడులకు పాల్పడితే రౌడీషీట్లు తెరవాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో దర్శి సీఐ షేక్ షమీముల్లా, ఎస్సై వి. నాగమల్లేశ్వరరావు, సిబ్బంది ఉన్నారు.

చెడుప్రవర్తన కలిగిన వారికి కౌన్సెలింగ్

మండలంలో చెడుప్రవర్తన కలిగిన వారిని పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి సీఐ షేక్.షమీముల్లా, ఎస్సై నాగమల్లేశ్వరరావు కౌన్సెలింగ్ ఇచ్చారు. మంచి ప్రవర్తన కలిగి ఉండాలని, ఎలాంటి నేరాలకు పాల్పడకూడదని సూచించారు.

మద్యం సీసాలు ధ్వంసం



మద్యం సీసాలు పగులగొడుతున్న పోలీసులు

మద్దిపాడు: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా మండలంలోని పలు చోట్ల ప్రాంతాల్లో దాడి చేసి పట్టుకున్న మద్యం సీసాలను మద్దిపాడు పోలీసులు బుధవారం ఉదయం పగులగొట్టారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవికుమార్ సమక్షంలో పోలీసు సిబ్బంది 66 క్వార్టర్ బాటిళ్లు, 15ఫుల్ బాటిళ్లు పగులగొట్టారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎక్కడి బాటిల్స్ అక్కడ పగులగొడుతున్న నేపథ్యంలో రూరల్ సీఐ టీఎస్ అజయ్‌కుమార్ అధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించినట్లు ఎస్సై తెలిపారు.

పగలైతే రూ.4,000.. రాత్రయితే రూ.2,500

- పాలేరు నుంచి యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా
- నెల మామూళ్ల మత్తులో సెబ్ టాస్క్‌ఫోర్స్ అధికారులు
- ట్రాక్టర్‌కు రూ.5 వేల చొప్పున రేటు ఫిక్స్

సింగరాయకొండ: అక్రమాలను అడ్డుకోవాల్సిన పోలీస్ అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారు. ట్రాక్టర్‌కు రూ.5 వేల చొప్పున ధర ఫిక్స్ చేసి మరీ వసూళ్లకు పాల్పడుతుండటం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఓ వైపు ఇసుక ఉచితంగా ఇస్తామని కూటమి ప్రభుత్వం ప్రకటించినా ధరలో ఏమాత్రం తేడా లేకపోవడంతో ప్రజల నుంచి తీవ్ర స్థాయిలో విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మరో వైపు ఇసుక దందా యథేచ్ఛగా సాగుతోంది. ఇటీవల కాలంలో పగలు ఇసుక ట్రాక్టరు కావాలంటే రూ.4 వేలు, రాత్రి వేళ ఇసుక కావాలంటే 2,500 రూపాయలకు సరఫరా చేస్తున్నారు. పగలు డంప్ యార్డ్ నుంచి ఇసుక సరఫరా చేయాల్సి ఉండగా.. రాత్రి వేళ మాత్రం తవ్వుకున్నోడే నేరుగా అమ్ముకోవాల్సి రావడంతో కాస్త ధర తగ్గించి ఇస్తున్నట్లు సమాచారం.

కలకలం రేపిన మామూళ్లు..

పాలేరు నుంచి నందనవనం- కలికవాయ మార్గంలో ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్ డ్రైవర్ల వద్ద రూ.5 వేల చొప్పున సెబ్ టాస్క్‌ఫోర్స్ అధికారులు మామూళ్లు వసూలు చేసిన సంఘటన సింగరాయకొండ మండలంలో కలకలం రేపింది. బుధవారం తెల్లవారుజామున కలికవాయ వద్ద మామూళ్లు వసూలు చేసినట్లు పేరు చెప్పడానికి ఇష్టపడని ఓ ట్రాక్టర్ డ్రైవర్ పేర్కొన్నాడు. అందిన సమాచారం ప్రకారం.. గత నెల రోజులుగా రాత్రి వేళ పాలేరు నుంచి నందనవనం- కలికవాయ మార్గంలో సుమారు 15 ట్రాక్టర్లు రాత్రి వేళ ఇసుక తరలిస్తున్నాయి. వీరిని చూసీచూడనట్లు వదిలేసేందుకుగాను ఒక్కో ట్రాక్టరుకు నెలకు రూ.5 వేలు ఇచ్చేలా సెబ్ అధికారులు బేరం కుదుర్చుకున్నట్లు ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ముందుగా అనుకున్న ప్రకారం నెల చివరలో డ్రైవర్లంతా మామూళ్లు చెల్లించాలి. ఈ నేపథ్యంలోనే బుధవారం తెల్లవారుజామున సెబ్ జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారులు కలికవాయ వద్ద తనిఖీలు నిర్వహించి అటుగా వస్తున్న ఏడు ట్రాక్టర్ల వద్ద రూ.5 వేల చొప్పున వసూలు చేసి వదిలేశారు. ఇసుక అక్రమ రవాణాను అడ్డుకునేందుకు ఏర్పాటు చేసిన టాస్క్‌ఫోర్స్ అధికారులు మామూళ్లు తీసుకోవడం మండలంలో చర్చనీయాంశంగా మారింది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

- లారీ, ద్విచక్రవాహనం ఢీకొన్న ఘటనలో



తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కొండయ్య

పెద్దదోర్నాల: ఎదురెదురుగా వస్తున్న లోడు లారీ, ద్విచక్ర వాహనం ఢీకొని ఒకరు మృతి చెందారు. ఈ సంఘటన కర్నూల్ గుంటూరు జాతీయ రహదారిపై గంటవానిపల్లె సమీపంలో జరిగింది. ప్రమాదంలో మండల పరిధిలోని బందంబావి గిరిజన గూడెంకు చెందిన కుడుముల రాజయ్య అలియాజ్ రాజు కొండయ్య (32) తీవ్ర గాయాలై మృతి చెందాడు. ఎస్సై అంకమరావు కథనం మేరకు..బందం బావికి చెందిన రాజు కొండయ్య జీవనోపాధి నిమిత్తం మండల పరిధిలోని గంటవానిపల్లె చెరువు సమీపంలో ఓ పత్తి చేనుకు కాపాలాదారునిగా చేరాడు. ఈ క్రమంలో గంటవానిపల్లె నుంచి ద్విచక్రవాహనంపై మండల కేంద్రానికి వస్తున్న క్రమంలో ఎదురుగా వస్తున్న లారీ, ద్విచక్రవాహనాలు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది తీవ్ర గాయాల పాలైన రాజు కొండయ్యను ప్రభుత్వ వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్స చేశారు. అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం ఒంగోలుకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య, కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఎస్సై సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

దుకాణంలో చోరీ కేసులో నిందితులు అరెస్ట్

- రిమాండ్‌కు తరలింపు

మార్కాపురం: పట్టణంలోని గడియారం స్తంభం సెంటర్‌లో ఏఎంఎస్ ఫ్లవర్ దుకాణంలో షట్టర్ పగులకొట్టి ఈనెల 27న దొంగతనం చేసిన కేసులో నిందితులను మార్కాపురం పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. దుకాణ యజమాని షేక్ ఖాజావలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మార్కాపురం ఎస్సై వెంకటేశ్వర్లు, పట్టణ ఎస్సై అబ్దుల్లా రహమాన్ నేతృత్వంలో ప్రత్యేక బృందాలను నియమించి ముద్దాయిలు షేక్ ఇనాయక్ ఆలీ, జిల్లి సాయి కుమార్‌లను అరెస్ట్ చేశారు. ముద్దాయి షేక్ ఇనాయక్ ఆలీ దుకాణం పక్కనే గతంలో పనిచేస్తూ దుకాణంలో నగదు రాత్రివేళ ఉంచుతున్న విషయాలను గమనించి రెండో ముద్దాయి సహకారంతో దొంగతనానికి పాల్పడ్డారు. మొత్తం సొత్తు రూ.లక్ష వరకు తీసుకెళ్లగా అందులో జల్సాల కోసం వాడుకోగా మిగిలిన సొత్తు రూ.35,480లను ముద్దాయిల నుంచి రికవరీ చేసినట్లు పట్టణ ఎస్సై అబ్దుల్ రహమాన్ తెలిపారు. ముద్దాయిలను కోర్టులో హాజరు పరచగా రిమాండ్ విధించినట్లు వివరించారు.

క్లుప్తంగా

ఆఫీస్ సబార్డినేట్‌కు ఘన సన్మానం



అంజయ్య దంపతులను సన్మానిస్తున్న జెడ్పీటీసీ, నాయకులు

కురిచేడు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆఫీస్ సబార్డినేట్‌గా పనిచేస్తున్న చామర్తి అంజయ్య ఉద్యోగ విరమణ చేశారు. ఎంపీడీఓ సీతా రామయ్య, ఈఓఆర్డీ ఆర్‌వీఎస్ ప్రసాదరావు, సిబ్బందితో పాటు ఎంపీపీ బెల్లం కోటేశ్వరమ్మ, జెడ్పీటీసీ నుసుం వెంకట నాగిరెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు అంజయ్య దంపతులను స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఘనంగా సన్మానించారు.తన శేష జీవితం ప్రశాంతంగా గడపాలని ఆకాంక్షించారు. ఆఫీస్ సబార్డినేట్ అనే వ్యత్యాసం చూపకుండా తమ కుటుంబ సభ్యుడిగా కార్యాలయం అధికారులు, సిబ్బంది తనకు ఘనంగా వీడ్కోలు పలికారని అంజయ్య సంతోషం వ్యక్తం చేశారు.

మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలకు నోటిఫికేషన్

దర్శి: మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ కె.హసీనా బేగం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న వారు తమ పేర్లను కమిటీ సభ్యులుగా పోటీ చేయదలచుకున్న వారు పాఠశాల ఆఫీసులో నమోదు చేసుకోవాలని తెలిపారు. ఆగస్టు ఒకటిన నోటిఫికేషన్ విడుదలవుతుందని, ఆగస్టు 8వ తేదీన ఎన్నికలు జరుగుతాయన్నారు. ఆసక్తి ఉన్న పిల్లల తల్లిదండ్రులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పాఠశాలలో మొక్కల పెంపకం



మొక్కలు అందజేస్తున్న పరిటాల సురేష్

కురిచేడు: మండలంలోని బోధనంపాడులోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో దర్శి లాయరు పరిటాల సురేష్ బుధవారం మొక్కలు నాటించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పాపారావు మాట్లాడుతూ చెట్లు ప్రగతికి మెట్లని, కాలుష్య నివారణకు ఎంతో మేలు చేస్తాయన్నారు. వర్షాలు సక్రమంగా వర్షించాలన్నా చెట్లు ఎంతో కీలకమన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాలుష్య కోరల నుంచి కాపాడాలని కోరారు. ఉపాధ్యాయులు షీలావాణి, సత్యవతి, వసంతరెడ్డి పాల్గొన్నారు.

ఫిజియోథెరపీతోనే దివ్యాంగులకు ఆరోగ్యం



ఎమ్మార్సీలో ఫిజియోథెరపీ చేస్తున్న డాక్టర్ అంకారావు

పుల్లలచెరువు: ఫిజియోథెరపీతోనే దివ్యాంగుల్లో కొంత మేరకు ఆరోగ్యంలో తేడాను గమనించవచ్చని డాక్టర్ అంకారావు అన్నారు. బుధవారం స్థానిక ఎమ్మార్సీ కేంద్రంలో ఫిజియోథెరపీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు పరీక్షలు చేశారు. ప్రతి ఒక్కరూ ఈ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. హెచ్ఎం ప్రియాంక్, ఐఈఆర్టీ తేజరూపిని పాల్గొన్నారు.

అమృతం కన్నా.. అమ్మ పాలు మిన్న!

- రేపటి నుంచి తల్లిపాల వారోత్సవాలు
- అంగన్‌వాడీల్లో గర్భిణులకు అవగాహన సదస్సులు

పుల్లలచెరువు:

పుట్టిన బిడ్డకు తొలి ఆహారం, మొదటి టీకా అమ్మపాలే. పిల్లలకు అవే అమృతంతో సమానం. బిడ్డ శారీరక ఎదుగుదలకు తల్లిపాలు ఎంతగానో తోడ్పతాయని వైద్యులు చెబుతుంటారు. శిశువు జన్మించిన వెంటనే వీలైనంత వరకు వేగంగా ముర్రుపాలు తాగించాలి. దీంతో పిల్లల రోగనిరోధక శక్తి పెరుగుతుంది. అందుకే తల్లిపాల ఆవశ్యకతను తెలిపేలా ఏటా ఆగస్టు తొలి వారంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తారు. ఈ ఏడాది కూడా మండలంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలు జరిపేందుకు ఐసీడీఎస్ అధికారులు సిద్ధమయ్యారు. మహిళలు గర్భం దాల్చిన నుంచి తల్లిపాల ఆవశ్యకత, బిడ్డ పోషణ, ఆరోగ్యంపై అవగాహన కల్పించాలి. లేనిపోని అపోహలతో అప్పుడే పుట్టిన బిడ్డకు తల్లిపాలకు దూరం చేయరాదు. ముర్రుపాలు ఎంత వేగంగా బిడ్డకు తాగిస్తే అంత ఆరోగ్యకరం. ఈ నేపథ్యంలో గర్భిణులు, బాలింతలు, వారి కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించేందకు ఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా తల్లిపాల వారోత్సవాలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఆగస్టు ఒకటో తేదీ నుంచి వారం పాటు అంగన్‌వాడీ కేంద్రాల్లో అవగాహన సదస్సులు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. కేంద్రాల్లోని పిల్లల తల్లులు, గర్భిణులకు అవగాహన కల్పించేందకు ఐసీడీఎస్ ఉద్యోగులు, ఆయాలు, సూపర్‌వైజర్లు సిద్ధంగా ఉన్నారు.

ముర్రుపాలతో రోగనిరోధక శక్తి

శిశువు జన్మించిన తొలి రోజుల్లో తల్లిపాలు చిక్కగా, పసుపు రంగులో ఉంటాయి. వీటినే ముర్రుపాలు అంటారు. ప్రొటీన్లు అధికంగా ఉండటంతో వీటిని శిశువు తీసుకుంటే రోగనిరోధక శక్తి పెరుగుతుంది. శిశువు జన్మించిన తొలి అరగంటలోపే ముర్రుపాలు



తల్లిపాల వారోత్సవాల పోస్టర్

పట్టడం ద్వారా చాలా రోగాలు నుంచి శిశువును రక్షించవచ్చు. ముర్రుపాలలో విటమిన్-ఏ, బీ, తగినంత ఐరన్ విలువలు ఉంటాయి. ముర్రుపాలు శిశువు పేగు బలానిచ్చి, జీర్ణశక్తిని పెంచుతుంది. కామెర్లు, విరేచనాలు వంటి రుగ్మతలు నుంచి శిశువును కాపాడకలుగుతాయి.

ఇవీ..ప్రయోజనాలు

తల్లి పాలలో ప్రొటీన్లు లాక్టోఫెరీన్, కోలోస్ట్రమ్ కొన్ని కీలకమైన హార్మోన్లు, రోగ నిరోధక శక్తి బాక్టీరియా ఉంటాయి.తల్లిపాలు తాగే పిల్లలు ఎక్కువగా బలంగా ఉంటారు. వ్యాధి నిరోధక శక్తి ఎక్కువగా ఉంటుంది. తెలివి తేటలు అధికంగా ఉంటాయి. డబ్బా పాలు తాగే పిల్లలకంటే చురుగ్గా ఉంటారు. బిడ్డకు పాలివ్వడం ద్వారా తల్లీబిడ్డల మధ్య అనుబంధం పెనవేసుకుంటుంది. తల్లిపాలు తేలికగా జీర్ణమవుతాయి. ఎలాంటి క్రిములు లేకుండా ఉంటాయి. బిడ్డ దవడలు బాగా బలమవుతాయి. పాలిచ్చే తల్లులకు నెలసరిలో రక్త స్రావం కూడా తక్కువగా ఉంటుంది. పాలిచ్చినంత కాలం మళ్లీ గర్భం రాకుండా గర్భనిరోధకంగా కూడా పనిచేస్తుంది. తల్లులకు రొమ్ము, గర్భాశయ క్యాన్సర్లు రావు.

ఆరు మాసాల వరకు తల్లిపాలే ఆహారం

బిడ్డ పుట్టాక తొలి ఆరు మాసాలు తల్లిపాలే ఆహారం. తప్పని పరిస్థితులో మినహా వేరే ఏ పాలూ బిడ్డకు పట్టించకుండా ఉండటమే మంచిదని వైద్యులు పేర్కొంటున్నారు. మొదటి రెండు నెలల్లో బిడ్డకు రెండు గంటలకోసారి పాటు పట్టాలి. రాత్రుళ్లు పాలివ్వడంతో తల్లి మెదడు నుంచి ప్రోలాక్టిన్ ఎక్కువగా స్రవిస్తుంది. ఇది పాల ఉత్పత్తికి అవసరమైన అతి ముఖ్యమైన హార్మోన్. ఎంత రాత్రి అయినా తల్లి పాలివ్వడం బిడ్డకు క్షేమం. నెలలు నిండే కొద్దీ ఈ వ్యవధి పెంచుకోవచ్చు. మొదటి ఆరు నెలలు తల్లిపాలు ఇవ్వడం ద్వారా బిడ్డకు తేలికగా జీర్ణమవుతుంది. శ్వాసకోశ, అలర్జీ, అస్తమా. చర్మవ్యాధుల నుంచి పిల్లలకు రక్షననిస్తాయి. ఆరుమాసాల తర్వాత బిడ్డకు తల్లిపాలతో పాటు వైద్యుల సూచనల మేరకు ఇతర ఆహారం ఇవ్వాలి.

బాధ్యతగా భావించాలి:



ముర్రుపాలు పట్టించడం భారం అనుకోకూడదు. పుట్టిన బిడ్డకు వెంటనే ముర్రుపాలు పట్టించాలి. ఆరు నెలల వరకు తల్లిపాలు మాత్రమే తాగించాలి. ముర్రపాలు బిడ్డకు అమృతం లాంటివి. వారోత్సవాల్లో భాగంగా ర్యాలీలు, అవగాహన సదస్సులు నిర్వహిస్తాం. అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో అవగాహన సదస్సులు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

పద్మావతి, సీడీపీవో, యర్రగొండపాలెం



వధూవరులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి

వధూవరులకు ఎమ్మెల్యే తాటిపర్తి ఆశీర్వాదం

పెద్దారవీడు: మండలంలోని పుచ్చకాయలపల్లిలో వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా జాయింట్ సెక్రటరీ పండి గురవయ్య సోదరులు శ్రీకాంత్, వంశీల వివాహానికి ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ హాజరై వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ చేదూరి విజయభాస్కర్, ఎర్రగొండపాలెం వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కొప్పర్తి ఓబులరెడ్డి, సర్పంచ్ వజ్రాల రామలక్ష్మమ్మ, గుడ్డెపోగు రమేష్, బెజవాడ అదాం, అంగిరేకుల ఆదినారాయణ, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ మండల అధ్యక్షుడు తోకల ఆవులయ్య, నాయకులు గుండారెడ్డి వెంకటేశ్వరరెడ్డి, వెన్నా శివకృష్ణారెడ్డి, మారంరెడ్డి రామస్వామిరెడ్డి, ఎం.కృష్ణారెడ్డి, బసుపాటి నాగరాజు, షేక్ బుజ్జి పాల్గొన్నారు.

పుల్లలచెరువు: మండలంలోని బీర్నేనిపల్లిలో వైఎస్సార్ సీపీ నాయకుడు మల్లవరపు బాలయేసు కుమారుడి వివాహ కార్యక్రమానికి యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ బుధవారం హాజరయ్యారు. ఈ సందర్భంగా చరణ్ దంపతులను ఎమ్మెల్యే ఆశీర్వదించారు.



వధూవరులతో ఎమ్మెల్యే తాటిపర్తి

ఎమ్మెల్యేతో పాటు పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉడుముల శ్రీనివాసరెడ్డి, నాయకులు రోసిరెడ్డి, జానకి రఘు, సచివాలయ మండల కన్వీనర్ డి. వెంకటేశ్వర్లు, జక్కె వెంకటేశ్వర్లు, బోల్లేపల్లి సాంబయ్య పాల్గొని నూతన దంపతులను ఆశీర్వదించారు. ఎమ్మెల్యే రాక సందర్భంగా గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది. ప్రజలు భారీ ఎత్తున పాల్గొని ఊరి పొలిమేర నుంచి ఊరేగింపుగా మేళ తాళాలతో ఎమ్మెల్యేకి ఘన స్వాగతం పలికారు.

మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డికి ఎమ్మెల్యే తాటిపర్తి సన్మానం

యర్రగొండపాలెం: పల్నాడు జిల్లా నరసరావుపేట మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డిని యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ఘనంగా సన్మానించారు. బుధవారం శ్రీనివాసరెడ్డి ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసేందుకు స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి వచ్చారు. ఆయనకు ఎమ్మెల్యేతో పాటు నాయకులు, కార్యకర్తలు స్వాగతం పలికి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తాటిపర్తి చంద్రశేఖర్ మాట్లాడుతూ పూర్తిగా వెనకబడిన తమ నియోజకవర్గం నుంచి అనారోగ్య కారణాలతో పేదలు నరసరావుపేటకు వస్తున్నారని, పరీక్షలు చేయించుకోవటానికి వచ్చిన పేదలను ఆదుకోవాలని డాక్టర్ గోపిరెడ్డిని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉడుముల శ్రీనివాసరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు ఒంగోలు మూర్తిరెడ్డి, ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్, జెడ్పీటీసీ చేదూరి విజయభాస్కర్, పార్టీ మండల అధ్యక్షుడు కె.ఓబులరెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ సయ్యద్ జబీవుల్లా, సర్పంచ్ ఆర్.అరుణాబాయి, నాయకులు ఏకుల ముసలారెడ్డి, నర్రెడ్డి వెంకటరెడ్డి, వై.వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.



మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి

మహిళలపై దాడులు అరికట్టాలి



మాట్లాడుతున్న రామన్న



హాజరైన విద్యార్థులు

దర్శి: మహిళలపై జరుగుతున్న దాడులు అరికట్టాలని, డ్రగ్స్ నిషేధం కోసం ప్రభుత్వమే సదస్సులు నిర్వహించాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న డిమాండ్ చేశారు. స్థానిక బాలికల పాఠశాలలో బుధవారం అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా రామన్న మాట్లాడుతూ సమాజంలో మహిళలపై రోజు రోజుకూ దాడులు పెరిగి పోతున్నాయని చెప్పారు. బాలికలపై లైంగిక వేధింపులు వెలుగులోకి వస్తున్నాయన్నారు. దాడులు, వేధింపులు తక్షణమే అరికట్టాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. నేటి సమాజంలో యువత చెడు వ్యసనాలకు గురవుతున్నారని, డ్రగ్స్‌ను అరికట్టే విధంగా నిషేధం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. దేశంలో నిరుద్యోగుల శాతం ఎక్కువగా ఉందని, యువత, యువకులు ఖాళీగా ఉండటంతో ఇలాంటి అరాచకాలు ఎక్కువగా జరుగుతున్నాయని చెప్పారు. రాష్ట్రంలో, కేంద్రంలో ఉన్న లక్షలాది ఉద్యోగ ఖాళీలు వెంటనే భర్తీ చేయాలని కోరారు. దొనకొండలో పరిశ్రమలు ఏర్పాటు చేసి పారిశ్రామికంగా అభివృద్ధి చేయాలన్నారు. దర్శిలో ఇంటర్నేషనల్ డ్రైవింగ్ స్కూల్ పనులు వెంటనే పూర్తి చేసి నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఖాదర్ మస్తాన్, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు వై.రాము, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కేవీ పిచ్చయ్య, రైతు సంఘ నాయకులు సందు వెంకటేశ్వరరావు, డీవైఎఫ్ఐ నాయకులు కంత వెంకట్రావు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి

- ఎమ్మెల్యే తాటిపర్తికి మహిళల విజ్ఞప్తి

యర్రగొండపాలెం: గ్రామంలో నెలకొన్న నీటి ఎద్దడి సమస్యను పరిష్కరించాలని మండలంలోని గుర్రపుశాల గ్రామానికి చెందిన మహిళలు ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్‌ను కోరారు. బుధవారం పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఆయన ఆ గ్రామనికి వెళ్లారు. ఈ సందర్భంగా ఎస్సీ పాలేనికి చెందిన మహిళలు తాగు నీటి కష్టాల గురించి ఆయన దృష్టికి తీసుకెళ్లారు. జగనన్న ప్రభుత్వ కాలంలో ట్యాంకర్లతో నీటి తోలకం జరిగేదని, కొత్త ప్రభుత్వం ఏర్పాటు అయిన తర్వాత నీటి తోలకం నిలిపి వేశారని, ఈ కారణంతో తాము నీటి కోసం అనేక కష్టాలు పడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీ తీర్మానం లేకుండా టీడీపీ నాయకులు తమ సొంత నిర్ణయాలు తీసుకొని పాత ట్యాంకర్ల స్థానంలో కొత్త ట్యాంకర్లను ఏర్పాటు చేశారని, అధికారులు కూడా వారికి వత్తాసు పలకటమే కాకుండా ఆన్‌లైన్‌ను కూడా తొలగించారని తెలిపారు. టీడీపీ వర్గీయులు ఏర్పాటు చేసుకున్న కొత్త ట్యాంకర్ల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు కాకపోవడంతో వారు కూడా అర్ధంతరంగా నీటి సరఫరాను నిలిపి వేశారని, దీని వలన గ్రామాల్లో నీటి ఎద్దడి నెలకొందని ఆయన వివరించారు. ఈ విషయాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారం అయ్యేవిధంగా చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే తాటిపర్తి హామీ ఇచ్చారు.



మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తాటిపర్తి

కార్యకర్తకు ఎమ్మెల్యే తాటిపర్తి పరామర్శ

యర్రగొండపాలెం: మండలంలోని గుర్రపుశాలలో అనారోగ్యంతో బాధపడుతున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ బుధవారం పరామర్శించారు. ఆ గ్రామ ఎస్సీ పాలేనికి చెందిన మామిళ్ల రోశయ్య, గార్లపాటి చిన్న దేవయ్యల గృహాల వద్దకు వెళ్లి ఆయన వారి ఆరోగ్య పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. వైద్య పరీక్షల సమయంలో తాను అండగా ఉంటానని ఆయన వారికి హామీ ఇచ్చారు.



కార్యకర్తలను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి



కౌలు రైతులకు బ్యాంకులో రుణాలు



మేనేజర్‌కు కౌలు రైతుల జాబితా అందిస్తున్న ఏఓ బుజ్జిబాయి

పెద్దారవీడు: కౌలు కార్డులు ఉన్న రైతులకు బ్యాంకులో రుణాలు ఇస్తారని వ్యవసాయాధికారి కె.బుజ్జిబాయి అన్నారు. మండలంలో హనుమాన్ జంక్షన్ కుంటలో ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ మేనేజర్‌కు తోకపల్లి రైతు సేవ కేంద్రం పరిధిలో కౌలు రైతుల జాబితాను బుధవారం అందజేశారు. ఆమె మాట్లాడుతూ కౌలు కార్డులు రైతులు తీసుకొని బ్యాంక్‌లో రుణాలు పొందాలని తెలిపారు. అలాగే ఎరువుల దుణాల్లో రిజిస్టర్లు, ఫామ్‌లు పరిశీలించారు. దుకాణాల తనిఖీలో భాగంగా శాంపిల్స్‌ను సేకరించారు. విత్తనాలు, ఎరువులు కొన్న చోట రైతులు బిల్లు తప్పనిసరిగా తీసుకుంటే వాటిలో ఏమైనా కల్తీ ఉన్నట్లు తెలితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గొబ్బూరులో భూసార పరీక్షలపై రైతులకు అవగాహన కల్పించారు. మట్టి పరీక్ష, విత్తన శుద్ధి చీడపీడల నివారణ పంటకు ఉపయోగపడే మిత్రపురుగుల పెంపుదలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. వీపీఏ విజయలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

పరీక్షలు ఇంగ్లిష్ మీడియంలో నిర్వహించాలి



సుబ్బారావు దంపతులను సన్మానిస్తున్న యూటీఎఫ్ నాయకులు

పెద్దారవీడు: ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం అమలు చేసి పరీక్షలు అదే భాషలో నిర్వహించాలని యూటీఎఫ్ రాష్ట్ర గౌరవ సలహాదారుడు మీగడ వెంకటేశ్వరరెడ్డి కోరారు. మండలంలో గొబ్బూరు గ్రామంలో ఎంపీపీ పాఠశాలలో సీనియర్ ఉపాధ్యాయులు ఎస్.రంగారెడ్డి అధ్యక్షతన ప్రధానోపాధ్యాయుడు గోసు సుబ్బారావు పదవీ విరమణ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడుతూ విద్యారంగాన్ని బలోపేతం చేసేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని, 117 జీఓ రద్దు చేసి ప్రాథమిక పాఠశాలను కొనసాగించాలని, డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయులను నియమించే జూన్ వరకు అవసరమైన ఉపాధ్యాయులను సర్దుబాటు చేసి ఇంకా అవసరమైన చోట విద్యా వలంటీర్లను నియమించాలని విజ్ఞప్తి చేశారు. తాకట్టులో ఉన్న ఉపాధ్యాయులు, ఉద్యోగుల పీఎఫ్, ఏపీజీఎల్, జీఐఎస్ ఖాతాల ఫ్రీ హోల్డ్‌లో ఉంచి లోన్లు, క్లోజర్లు వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సిలబస్‌పై సమీక్ష చేసి సోషల్ సిలబస్ తగ్గించి గణితం, భౌతిక శాస్త్రం, బయాజీ సిలబస్ తగినంత పెంచాలన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ అధ్యక్షులు, కార్యదర్శి ఒద్దుల వీరారెడ్డి, డి.ఆంజనేయులు, జిల్లా కార్యదర్శులు వెన్నా వెంకటరెడ్డి, ప్రభాకర్, శ్రీరాములు, ఉపాధ్యాయులు పాల్గొని గోసు సుబ్బారావు దంపతులను పూలమాల, శాలువాతో ఘనంగా సన్మానించారు.

రామసుబ్బారెడ్డి సేవలు మరువలేనివి

పెద్దదోర్నాల: విద్యార్థులను తీర్చిదిద్దడంలో రామసుబ్బారెడ్డి సేవలు మరువలేనివని ఎంఈఓ మస్తాన్‌నాయక్ కొనియాడారు. మండల పరిధి ఐనముక్కల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తూ పదవీ విరమణ పొందిన చిట్యాల రామసుబ్బారెడ్డిని యూటీఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి ఘనంగా సన్మానం నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు ఎంఈఓలతో పాటు రాజకీయనేతలు, ఉపాధ్యాయులు పాల్గొని రామసుబ్బారెడ్డి దంపతులను ఘనంగా సత్కరించారు. మండల కేంద్రంలోని బొగ్గరపు సత్యమమ్మ కళ్యాణ మండపంలో జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంఈఓ మస్తాన్‌నాయక్ మాట్లాడుతూ తనతో పాటు పని చేసే ఉపాధ్యాయుల సహకారం, పరస్పర అవగాహనతో పాఠశాలలోని విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన అందించారన్నారు. విధులు నిర్వహించిన ప్రతిచోటా మంచి పేరు ప్రఖ్యాతలు గడించటంతో పాటు పని చేసిన ప్రతి ప్రాంతంలోనూ స్థానికుల్లో మంచి పేరు ప్రఖ్యాతులు గడించారని చెప్పారు. ఈ సందర్భంగా రామసుబ్బారెడ్డి దంపతులను పూలమాలలు, దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. మాజీ ఎంపీపీ ధర్మానాయక్, ఎంఈఓలు రాందాస్‌నాయక్, తులసీ మల్లికార్జుననాయక్, ప్రధానోపాధ్యాయుడు నారాయణరెడ్డి, మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు గంటా రమణారెడ్డి, యక్కంటి వెంకటేశ్వరరెడ్డి, పవన్‌కుమార్, ఉపాధ్యాయులు కిరణ్ కిశోర్ కుమార్, వర్ధన్, మొద్దు నాగేశ్వరరావు, కోటపాటి శ్రీనివాస్, శ్రీకాంత్ మహంతానాయక్, కాశీరాములు, కేసీహెచ్ సుబ్బారెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



రామసుబ్బారెడ్డిని సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

ముండ్లమూరు: మండలంలోని పెద్ద ఉల్లగల్లు శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయం 17వ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం 16 రోజుల పండగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. లక్ష్మీపద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి 16 రోజుల పండగ సందర్భంగా పూజారి పరాశరం నరసింహమూర్తి ప్రత్యేక పూజలు చేశారు. తొలుత స్వామివారికి సుప్రభాత సేవ, బిందె తీర్థం, అవపాసన, అభిషేకాలు వంటి పూజా కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి మూలవిరాట్, ఉత్సవమూర్తులను వివిధ పూలతో సుందరంగా అలంకరించారు. స్వామి వారికి గ్రామస్తులు పట్టు వస్త్రాలు సమర్పించి పూజలు చేశారు. అనంతరం తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు.

